క్లుప్తంగా

ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ పునరుద్ధరణ



సాక్షి ఎఫెక్ట్

రఘునాథపల్లి: మండలంలోని కన్నాయపల్లి శివారు కోడూర్ రోడ్డులో ఎస్ఎస్ 7 ట్రాన్స్‌ఫార్మర్ కింది రైతుల మధ్య నెలకొన్న వివాదంతో సంబంధిత కాంట్రాక్టర్ ఆ ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిపి వేశారు. మూడు రోజులుగా విద్యుత్ సరఫరా లేక పోవడంతో రైతుల ఆందోళనపై 'కాంట్రాక్టర్ నిర్లక్ష్యం..ఎండుతున్న పొలాలు' అనే శీర్షికన ఈ నెల 6న సాక్షిలో ప్రచురితమైన కథనానికి విద్యుత్ అధికారులు ఏడీఈ మనోహర్‌రెడ్డి, ఏఈ రాహులు వెంటనే స్పందించారు. బుధవారం ఉదయాన్నే కాంట్రాక్టర్ సిబ్బందితో కన్నాయపల్లికి చేరుకొని గతంలో మాదిరిగా ట్రాన్స్‌ఫార్మర్ రెండు ఫీడర్లకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. ఈ సందర్భంగా విద్యుత్ అధికారులు ఏడీఈ, ఏఈ, సాక్షికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి అనుమతివ్వండి

జనగామ: పట్టణంలోని 12వ వార్డు పరిధిలోని మున్సిపల్ స్థలంలో కమ్యూనిటీ హాల్‌తో పాటు ఎల్లమ్మ, పోచమ్మ ఆలయాల నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని కోరుతూ కౌన్సిలర్ గుర్రం భూలక్ష్మీనాగరాజు బుధవారం కమిషనర్ వెంకటేశ్వర్లకు వినతి పత్రం అందజేశారు. కాలనీవాసులు పోచమ్మ ఆలయానికి వెళ్లాలంటే దూర భారంగా మారిందని, స్థానికంగా నిర్మాణం కోసం సహకారం అందించాలన్నారు. ఈ విషయమై కాలనీ ప్రజల కోరికను పరిగణలోకి తీసుకుని స్పందించాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్థికసాయం

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని శివునిపల్లికి చెందిన ఆకుల ప్రవీణ్(42) అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతిచెందాడు. కాగా, గ్రామ మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపి రూ.15వేలు సాయం అందజేశారు. నాయకులు కొంతం శ్రీనివాస్, తోట భిక్షపతి, పీఏసీఎస్ డైరెక్టర్ తోట సత్యం, తోట సోమయ్య, గాండ్ల గిరి, పింగిలి భిక్షపతి, గాండ్ల రంగయ్య, జక్కం లక్ష్మీనారాయణ, గాండ్ల సత్యం ఉన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ శివారు పల్లగుట్ట క్రాస్‌రోడ్డు వద్ద జాతీయ రహదారిపై టీవీఎస్ ఎక్సెల్ వాహనాన్ని రెడీమిక్స్ లారీ మంగళవారం ఢీకొట్టిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ భూక్యా వెంకట్రాంనాయక్(55) చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. జఫర్‌గఢ్ మండలం అల్వార్‌బండ తండాకు చెందిన భూక్యా వెంకట్రాంనాయక్, అతని భార్య రంగమ్మ వ్యక్తిగత పనులపై టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై మంగళవారం చిల్పూరు మండలం దేశాయితండాకు వెళ్లి వస్తుండగా ఘన్‌పూర్ శివారు పల్లగుట్ట క్రాస్‌రోడ్డు వద్ద రెడీమిక్స్ లారీ ఢీకొట్టిన ఘటన విదితమే. ఈ ప్రమాదంలో వెంకట్రాంనాయక్‌కు తీవ్రగాయాలు కాగా మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. కాగా, చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు మృతుడి కుటుంబ సభ్యులు తెలిపారు.

కాంగ్రెస్ విధానాలను నిరసిస్తూ రాస్తారోకో..


పాలకుర్తి: కాంగ్రెస్ ఎల్ఆర్ఎస్ పేరుతో ప్రజలను మోసం చేస్తుందని ప్రభుత్వ విధానాలు నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పాలకుర్తి మండల కేంద్రంలో బుధవారం నాయకులు, కార్యకర్తలు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్ మాట్లాడారు. అధికారంలోకి వచ్చాక ఎల్ఆర్ఎస్‌ను రద్దు చేస్తామని చెప్పి అమలు చేయడం సరికాదన్నారు. రైతుల రుణమాఫీని ఇప్పటి వరకు చేయకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కార్యదర్శి మాచర్ల ఎల్లయ్య, పాము శ్రీనివాస్, వేణు, కళింగరావు, వెంకన్న, శంకర్, దార శంకర్, మూల వెంకటేశ్వర్లు, కృష్ణమూర్తి, కమ్మగాని పరమేశ్వర్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాలి

జఫర్‌గఢ్: జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వడ్లకొండ సుధాకర్ కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండలంలోని తమ్మడపల్లి (జి)లో ఉపాధి కూలీలతో మంగళవారం రాత్రి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సంఘం గ్రామ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు కన్నె బోయిన నాగయ్య, మల్లేష్ పాల్గొన్నారు.

శివకేశవుల నిలయం పాలకుర్తి పుణ్యక్షేత్రం

- నేటి నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభం
- బ్రహ్మోత్సవాలకు భారీ ఏర్పాట్లు



సోమేశ్వరస్వామి గుట్ట



గుహలో లింగరూపంలో సోమేశ్వరుడు

పాలకుర్తి టౌన్: తెలంగాణ రాష్ట్రంలోని ప్రముఖ శైవ క్షేత్రాల్లో ప్రసిద్ధిగాంచిన పాలకుర్తిలోని సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆలయ అధికారులు భారీ ఏర్పాటు చేస్తున్నారు. హరిహరులకు నిలయంగా, స్వయంభువులుగా ఒకే గుట్టపై వెలసిన దివ్య క్షేత్రంగా పాలకుర్తి పుణ్య క్షేత్రంగా వెలుగొందుతోంది. ప్రతి ఏటా మహా శివరాత్రి సందర్భంగా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. వేలాది మంది భక్తులు శైవ క్షేత్రాన్ని దర్శించుకుని పునీతులవుతారు. ఈ సారి జాతరకు వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించడానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 7వ తేదీ నుంచి 11 వరకు జరిగే బ్రహ్మోత్సవాలకు ఇతర జిల్లాల నుంచే కాకుండా పలు రాష్ట్రాల నుంచి భక్తులు తరలి వస్తారు. 8న మహాశివరాత్రి పర్వదినం రోజున నిర్వహించే స్వామివారి కల్యాణానికి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. రాజకీయ ప్రముఖులు, భక్తులతో పాటు ఉన్నతాధికారులు తరలి వస్తారు.

బ్రహ్మోత్సవాల వివరాలు..

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 7వ తేదీన గణపతి పూజ, పుణ్యాహవచనం, ధ్వజారోహణ, 8న స్వామి వారి కల్యాణ మహోత్సవం, 9న రథోత్సవం, బండ్లు తిరుగుట, 10న డోలారోహణం, వసంతోత్సవం, 11న అగ్నిగుండాలతో ఉత్సవాలు ముగుస్తాయి.

భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు..

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా వేలాదిగా భక్తులు రానున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తికావొచ్చాయి. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు చర్యలు తీసుకున్నాం.



– భాగం లక్ష్మీప్రసన్న, ఈఓ

ఎన్నికల విధులు సక్రమంగా నిర్వర్తించాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకన్న

స్టేషన్‌ఘన్‌పూర్: రానున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల విధులపై సంపూర్ణ అవగాహనతో అప్రమత్తంగా పనిచేయాలని ఘన్‌పూర్ ఆర్డీఓ డీఎస్ వెంకన్న అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నియోజవకర్గంలోని వివిధ మండలాలకు చెందిన సూపర్‌వైజర్లకు బుధవారం ఎన్నికలపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్డీఓ మాట్లాడారు. ఓటరు జాబితాలో మొదటిపేజీలో పోలింగ్‌కేంద్రం నంబర్, పోలింగ్‌కేంద్రం పేరు, లొకేషన్ తదితర వివరాలు సరిగ్గా ఉన్నాయా అని పరిశీలన చేసుకోవాలన్నారు. గ్రామం నుంచి శాశ్వతంగా వెళ్లిపోయిన, మృతిచెందిన వారి జాబితాలు తయారు చేయాలన్నారు. ఫారమ్–6, 7, 8 కొత్త ఓటర్ల నమోదు, సవరణలు తదితర పనులను త్వరగా పూర్తి చేయాలని ఆయన సూచించారు.

పాఠశాలల్లో స్వయంపాలన



చిల్పూరు: విద్యార్థులతో ఉపాధ్యాయులు

చిల్పూరు/బచ్చన్నపేట/దేవరుప్పుల: చిల్పూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థులు స్వయంపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులుగా విద్యాబోధన చేశారు. ఎంఈఓగా ఆర్.పవన్, హెచ్ఎంగా కె.పవన్ వ్యవహరించారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు శ్రీదేవి, రాధాకృష్ణ, వేణు, మంజుల, వెంకటరమణ పాల్గొన్నారు. అలాగే బచ్చన్నపేట మండలం మన్‌సాన్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో స్వయంపాలన నిర్వహించారు. డీఈఓగా, ఎంఈఓగా, హెచ్ఎంగా, ఉపాధ్యాయులుగా విద్యార్థులు వ్యవహరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాములు, టీచర్ మదూరి రోజ, అంగన్‌వాడీ టీచర్ కవిత, సీఆర్పీ సరిత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. దేవరుప్పుల మండలంలోని ప్రాథమిక పాఠశాలలో స్వయంపాలన దినోత్సవ ఘనంగా నిర్వహించారు. డీఈఓగా అఖిల, ఎంఈఓగా సాయిప్రక్షిత్, హెచ్ఎంగా సాయితేజ, ఉపాధ్యాయులుగా అక్షిత, సింధు, ప్రియాంక, రాహిత్య, ఆఫీస్ సబార్డినేట్లుగా వరుణ్, సాధిక్ పాషా వ్యవహరించారు. కార్యక్రమంల హెడ్మాస్టర్ ముడిదె రాము, విజయపాల్ రెడ్డి, సరిత పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

బచ్చన్నపేట: మండల కేంద్రంలో పేదకుటుంబాలకు బీఆర్ఎస్ నాయకుడు, ఐవీఎఫ్ జిల్లా యూత్ అధ్యక్షుడు జిల్లా సందీప్‌గుప్తా తన పుట్టిన రోజును పురస్కరించుకొని రూ.15వేల విలువైన నిత్యావసర సరుకులను బుధవారం పంపిణీ చేశారు. నాయకులు వడ్డెపల్లి ఉపేందర్‌రెడ్డి, షబ్బీర్, జావీద్, గుర్ర పు బాల్‌రాజు, గంధమల్ల నరేందర్, తెల్ల సందీప్, గుర్రాల అనిల్‌రెడ్డి, సిద్దులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవ విగ్రహాల ఊరేగింపు



లింగాలఘణపురం: మండల కేంద్రంలో బుధవారం వీరభద్రస్వామి, భద్రకాళీ ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. వీరన్నగుట్ట వద్ద ఈ నెల 7న ప్రతిష్ఠాపన చేసే ఉత్సవ విగ్రహాలను దాత కేమిడి ఐలయ్యభాయాదేవి అందజేయగా ఆలయ కమిటీ అధ్యక్షుడు బి.సత్తయ్య ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగించి వీరన్నగుట్టకు తీసుకెళ్లారు. భక్తులు ధూపదీప నైవేద్యాలు సమర్పించి మొక్కలు చెల్లించారు. మాజీ సర్పంచ్ కేమిడి సాయిమల్లయ్య, శ్రీనివాసు, రాంచందర్, శ్రీశైలం, కేమిడి వెంకటేశ్, కేశపు లక్ష్మీనారాయణ, బింగి స్వామి పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



బచ్చన్నపేట: మండలంలోని బండనాగారం, పోచన్నపేట గ్రామాల్లో కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షులు ఇప్ప శ్రీధర్‌రెడ్డి, ఆకిరెడ్డి శ్రీధర్ ఆధ్వర్యంలో బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను సీఎం అమలు చేస్తున్నారని అన్నారు. త్వరలోనే అందరికి సొంతింటి కల నెరవేరుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు సవాదు నర్సమ్మ, మానెపల్లి భవాని, ఇజ్జగిరి రాములు, పర్శరాములు, చల్ల రమేష్‌రెడ్డి, మానెపల్లి బాపురాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా అడుగులు వేయాలి



మాట్లాడుతున్న ఏసీపీ దామోదర్‌రెడ్డి

నర్మెట: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని జనగామ ఏసీపీ దామోధర్‌రెడ్డి అన్నారు. వెల్దండలోని ఉన్నత పాఠశాలను బుధవారం సందర్శించి 10వ తరగతి విద్యార్థులకు ప్రేరణ కార్యక్రమంలో భాగంగా పలు సూచనలు చేశారు. పరీక్షలవేళ ఎలాంటి ఒత్తిడులకు, భయాందోళనకు గురికాకుండా ప్రశాంతతతో కష్టంగా కాకుండా ఇష్టంగా చదివి లక్ష్యాలను చేరుకోవాలని అన్నారు. విద్యతోపాటు ఉచిత వసతులను కల్పిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చదివించాలని ఆయన ఈసందర్భంగా తల్లితండ్రులకు సూచించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, బంగారు భవిష్యత్‌పై దృష్టి సారించాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్సై కన్నెబోయిన శ్రీకాంత్, ఇన్‌చార్జ్ హెచ్ఎం పాలెపు విజయ, ఉపాధ్యాయులు ప్రేమలత, తిరుమల్ రెడ్డి, కృష్ణమూర్తి, కవితశ్రీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవ కమిటీ ఎన్నిక



కృష్ణ, అధ్యక్షుడు

బచ్చన్నపేట: మండలంలోని కొడవటూర్ గ్రామంలోని సిద్ధేశ్వరాలయ ఉత్సవ కమిటీని నియమించారు. బుధవారం ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను దేవాదాయ శాఖ కమిషనర్ వి.అనిల్‌కుమార్ జారీ చేశారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా మండలంలోని కేసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన గాలి కృష్ణను నియమించారు. కమిటీ సభ్యులుగా గుంటిపెల్లి హరినాథ్ (బచ్చన్నపేట), ఆలేటి సిద్దిరాములు(జనగామ), ఆరేళ్ల భాస్కర్ (బండనాగారం), నిమ్మ కర్ణాకర్‌రెడ్డి (కొడవటూర్), ఈర్ల శివరాములు(పోచన్నపేట), వల్లాల సత్యం (గోపాల్‌నగర్), జంగిటి కళ్యాణి(నారాయణపురం), పోచంపల్లి శ్రీను(బచ్చన్నపేట), నీల మధు(కేసిరెడ్డిపల్లి), సానిక రాజు(తమ్మడపల్లి), నూకల భూపాల్‌రెడ్డి (లక్ష్మాపూర్), బైరగోని కనుకయ్య(ఇటుకాలపల్లి)లను నియమించారు. ఈ కమిటీ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సమక్షంలో నేడు (గురువారం) ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు తెలిపారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో మహాశివరాత్రి సందర్భంగా బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నారు.

రైతుల సంక్షేమానికే 'రైతునేస్తం'

కొడకండ్ల: రైతుల సంక్షేమం కోసమే సీఎం రేవంత్ రెడ్డి రైతునేస్తం కార్యక్రమాన్ని ప్రారంభించారని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు, ప్రజాప్రతినిధులతో పాటు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి నిరంతరం వెన్నుదన్నుగా నిలుస్తుందని సీఎం భరోసా కల్పించి, పంటల మార్పిడి విధానం అవలంబించావాలని చేసిన సూచనలు రైతులు పాటించాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ సోమరాములు, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు రాజేష్‌నాయక్, సీనియర్ నాయకులు అమరేందర్‌రెడ్డి, నియోజకవర్గంలోని వ్యవసాయ శాఖ అధికారులు, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

చిల్పూరు: విజయ డెయిరీకి పాలు పోసే రైతులను ఇబ్బంది పెట్టొద్దని శ్రీకృష్ణ పాలఉత్పత్తి దారుల సహకార సంఘం అధ్యక్షుడు సాదం రమేష్ కోరారు. బుధవారం విజయ డెయిరీ ఎదుట తలపెట్టిన చలో లాలాపేట కార్యక్రమంలో భాగంగా మండలంలోని కృష్ణాజీగూడెంలో రైతులతో కలిసి ఆయన మాట్లాడారు. డెయిరీకి పాలు పోసే రైతులకు 15 రోజులకు ఒకసారి బిల్లు చెల్లించాల్సి ఉండగా నవంబర్ నుంచి ఇప్పటి వరకు ఇవ్వకుండా ప్రభుత్వం, డెయిరీ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. వెంటనే బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎంపీటీసీ నర్సింహులు, రమేష్, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

బీజేపీతోనే మహిళా సాధికారత



స్టేషన్‌ఘన్‌పూర్: నారీ శక్తి వందన్‌లో నాయకులు, మహిళలు

స్టేషన్‌ఘన్‌పూర్: భారతీయ జనతా పార్టీ ద్వారానే మహిళా సాధికారత సాధ్యమని, మహిళలకు సముచిత స్థానం కల్పించింది బీజేపీయేనని పార్టీ పార్లమెంట్ కన్వీనర్ ఇనుగాల యుగేందర్ రెడ్డి అన్నారు. నారీ శక్తి వందన్ అభినందన్ ప్రోగ్రాంలో పశ్చిమ బెంగాల్ కోల్‌కత్తా నుంచి ప్రధాని నరేంద్రమోదీ ప్రసంగ కార్యక్రమాన్ని వర్చువల్ వీడియో కాన్ఫరెన్స్ చేపట్టారు. ఇందులో భాగంగా బుధవారం ప్రోగ్రాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోకల సంపత్ రెడ్డి, కన్వీనర్ బూర్ల విష్ణు ఆధ్వర్యంలో స్థానిక మాగార్డెన్స్ ఫంక్షన్ హాల్‌లో చేపట్టిన కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన యుగేందర్‌రెడ్డి మాట్లాడుతూ సమాజంలో స్త్రీ పాత్ర ఎంతో గొప్పదని, మహిళలు ఆర్థిక స్వావలంభన కలిగి ఉంటే ఆ కుటుంబం, సమాజం బాగుటుందన్నారు. నాయకులు గంటె ఉపేందర్, కోరుకొప్పుల నాగేష్, బుర్ర తిరుపతి, సాకి సంపత్,ర గోనెల రాజు, రడపాక ప్రదీప్, తాళ్లపల్లి శ్రీను మహిళలు పాల్గొన్నారు.

జనగామలో..

జనగామ రూరల్: బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు మాలతిరెడ్డి ఆధ్వర్యంలో నారీ శక్తి వందన్ కార్యక్రమాన్ని పట్టణంలోని జూబ్లీ ఫక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు.

దరఖాస్తుల సవరణ పూర్తి చేయాలి



దేవరుప్పుల: మాట్లాడుతున్న మొగులప్ప

దేవరుప్పుల: ప్రజాపాలన దరఖాస్తుల్లో లోపించిన డాటా సవరణకు అధికార యంత్రాగం పాటుపడాలని డీఆర్డీఓ పీడీ మొగులప్ప సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తుల, ఉపాధి హామీ పథకం వేసవి పనుల కార్యాచరణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమీక్షలో ఎంపీడీ లక్ష్మీనారాయణ, ఎంపీఓ సురేష్‌కుమార్, సూపరింటెండెంట్ ఉమామహేశ్వర్, ఈజీఎస్ ఏపీఓ కమ్మగాని శ్రీనివాస్, విద్యుత్‌శాఖ ఏఈ సుధాకర్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఇజిఎస్ టీఏ, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

పాలకుర్తి టౌన్: ఉపాధి హామీ పనులు చేసే కూలీలు సమయపాలన పాటించాలని డీఆర్డీఓ పీడీ మొగులప్ప అన్నారు. మండలంలోని తొర్రూరు గ్రామంలో ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఏపీఓ అంబాల మంజుల, పంచాయతీ కార్యదర్శి మహేష్, ఈసీ వెంకటేష్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

అభయహస్తం దరఖాస్తుల సవరణ చేసుకోండి

రఘునాథపల్లి: అభయహస్తం దరఖాస్తుల్లో తప్పుగా పొందుపర్చిన వివరాలను మండల పరిషత్ కార్యాలయంలో సవరణ చేసుకునేందుకు దరఖాస్తుదారులు తమ ధ్రువీకరణ పత్రాలతో గ్రామాల వారీగా కేటాయించిన తేదీల్లో హాజరు కాగలరని ఎంపీడీఓ గార్లపాటి శ్రీనివాస్ బుధవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ నెల 7వ తేదీన రఘునాథపల్లి, కంచనపల్లి, ఖిలాషాపూర్, గోవర్దనగిరి, 11న అశ్వరావుపల్లి, నిడిగొండ, భాంజీపేట, కోమల్ల, 12న కుర్చపల్లి, వెల్ది, ఆంధ్రతండా, అయ్యవారిగూడెం, దాసన్నగూడెం, ఫతేషాపూర్, 13న గబ్బెట, గిద్దబండతండా, ఇబ్రహీంపూర్, జాఫర్‌గూడెం, కన్నాయపల్లి, కోడూర్, 14న కుసుంబాయి తండా, లక్ష్మీతండా, మాధారం, మల్లంపల్లి, మండలగూడెం, 15న మంగళిబండతండా, మేకలగట్టు, శ్రీమన్నారాయణపురం, పడమటిగూడెం, పొట్టిగుబ్బటితండా, రామన్నగూడెం, 16వ తేదీన రామరాయనిబంగ్లా, శివాజీనగర్, సోమయ్యకుంటతండా, వేపలగడ్డతండా, ఎల్లారెడ్డిగూడెం దరఖాస్తుదారులు హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు ప్రజాపాలనలో అందజేసిన ఫారాల్లో ఏమైనా తప్పులు దొర్లితే సవరణ దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ రఘురామకృష్ణ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో ఆయన మాట్లాడారు. దరఖాస్తులో రేషన్ కార్డు, గ్యాస్, విద్యుత్ మీటరు నంబర్ల సవరణకు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ దరఖాస్తులను ఎంపీడీఓ కార్యాలయంలో స్వీకరిస్తారని తెలిపారు. నేడు (గురువారం) బసిరెడ్డిపల్లి, భోనకొల్లూర్, కేసిరెడ్డిపల్లి, చిన్నరామన్‌చర్ల, 11న దబ్బగుంటపల్లి, గంగాపూర్, గోపాల్‌నగర్, ఇటుకాలపల్లి, రామచెంద్రాపూర్, 12వ తేదీన కట్కూర్, కొడవటూర్, వీఎస్ఆర్ నగర్, కొన్నె, నక్కవానిగూడెం, 13న లింగంపల్లి, మన్‌సాన్‌పల్లి, పడమటికేశ్వాపూర్, సాల్వాపూర్ , 14వ తేదీన నాగిరెడ్డిపల్లి, నారాయణపురం, పోచన్నపేట, తమ్మడపల్లి గ్రామాల ప్రజలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంబంధిత పత్రాలు తీసుకురావాలని సూచించారు.

ఇష్టంతో చదవాలి



విద్యార్థులతో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ రూరల్: విద్యార్థులు ఇష్టంతో చదివి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని వడ్లకొండ గ్రామంలోని గ్రీన్ వుడ్ పాఠశాల వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చడానికి పట్టుదలలో చదివి పదోతరగతిలో 10/10జీపీఏ సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సల్లావుద్దిన్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా..

నర్మెట: పార్టీకి మూల స్తంభాలైన కార్యకర్తలకు పార్టీ అండ ఎల్లప్పుడూ ఉంటుందని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. వెల్దండకు చెందిన బీఆర్ఎస్ నాయకులు కాసర్ల కరుణాకర్ పాముకాటుకు గురై కొద్ది నెలల క్రితం మృతిచెందాడు. కాగా, పార్టీ సభ్యత్వ బీమా రూ. 2 లక్షల చెక్కును మృతుడి భార్య అలివేలుకు బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ ఎండీ గౌస్, వైస్ ఎంపీపీ మంకెన ఆగిరెడ్డి, తాజా మాజీ సర్పంచ్ నర్రా వెంకట రమణా రెడ్డి, ఉమ్మడి మండలాల కన్వీనర్ పెద్ది రాజిరెడ్డి, అధికార ప్రతినిధి వంగ రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాడుదాం..



మాట్లాడుతున్న జ్యోతి

జనగామ రూరల్: కేంద్రం ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాడుదామని తెలంగాణ మహిళా సమాఖ్యరాష్ట్ర ప్రధాన కార్యదర్శి నెదునూరి జ్యోతి అన్నారు. బుధవారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక మహిళలపై అత్యాచారాలు, దాడులు పెరిగాయని, సాంప్రదాయాల పేరుతో సామ్రాజ్యవాద విధానాలు అమలు చేస్తుందన్నారు. మహిళలపై దాడులు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకొనేలా చట్టాలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో చింతకింది అరుణ, నిర్మల, సఖి, పద్మ, విజయ సుమర్ణ, వీరమ్మ, మంజుల పాల్గొన్నారు.

బీజేపీ విధానాలను ప్రతిఘటించాలి

మహిళల హక్కులు హరించే బీజేపీ విధానాలను ప్రతిఘటించి.. స్వేచ్ఛ, సమానత్వం కోసం ఉద్యమించాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ షబానా పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ఐద్వా కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని జిల్లా స్థాయి సమావేశం పట్టణ అధ్యక్షురాలు కొండ వరలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. శ్రీలత,రాపర్తి రాజు, గౌసియా, చంద్రకళ, సబిత, సుమలత, మల్లమ్మ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పరామర్శ

స్టేషన్‌ఘన్‌పూర్: తాటికొండ గ్రామానికి చెందిన పండుగ కొమురయ్య, మారపాక పోచమ్మ, మారపాక లక్ష్మి, వెంకటయ్య, గునిగంటి రాజు, రొయ్యల గట్టయ్య ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందారు. కాగా బాధిత కుటుంబాలను వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5వేలు చొప్పున సాయం అందజేశారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఒకరికి జైలు

జనగామ: మద్యం సేవించి డ్రైవింగ్ చేసిన కేసులో పట్టుబడిన వ్యక్తికి జనగామ కోర్టు జరిమానాతో పాటు ఒక రోజు జైలుశిక్ష విధించినట్లు ఎస్సై సృజన్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ జనగామకు చెందిన యువకుడు డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడగా, కోర్టులో ప్రవేశపెట్టడంతో సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ వెంకటరాంనర్సయ్య రూ.వెయ్యి జరిమానా, ఒకరోజు జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించినట్లు పేర్కొన్నారు.

లింగాలఘణపురంలో..

లింగాలఘణపురం: మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో హైదరాబాద్‌కు చెందిన మల్లెల సంతోష్ అనే వ్యక్తికి జనగామ మెజిస్ట్రేట్ ఒక రోజు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైన మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడితే శిక్షలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

రేషన్ బియ్యం పట్టివేత

జఫర్‌గఢ్: మండలంలోని కోనాయిచలం గ్రామంలో ఇంటి వద్ద అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యం పట్టుకునట్లు ఎస్సై శీలం రవియాదవ్ తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. కోనాయిచలం గ్రామానికి చెందిన ఉప్పలయ్య తన ఇంటి ఆవరణలో నిల్వ చేసిన 7 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకోవడంతో పాటు బాధ్యుడిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

గీత కార్మికుడికి గాయాలు

పాలకుర్తి: వల్మిడి గ్రామంలో గీత కార్మికుడు కూటికంటి సతీష్ గౌడ్ బుధవారం తాటి చెట్టు పైనుంచి పడి తీవ్ర గాయాల పాలయ్యాడు. వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కాగా, గౌడ జన హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి మూల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం సతీష్‌కు మెరుగైన వైద్యం అందజేసి ఆదుకోవాలని కోరారు.

కొలతల ప్రకారం పనులు చేయాలి

బచ్చన్నపేట: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులకు వెళ్లే కూలీలు కొలతల ప్రకారం పనులు చేయాలని, అప్పుడే సరైన కూలి గిట్టుబాటు అవుతాయని ఎంపీడీఓ రఘురామకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని ఇటుకాలపల్లిలో ఈజీఎస్ పనులను, అలాగే గ్రామ పంచాయతీ కార్యాలయంలో జీపీ రికార్డులను ఆయన పరిశీలించి మాట్లాడారు.